మూలం : మహా ప్రవక్త మహితోక్తులు (అల్- లూలు వల్ మర్జాన్) (Al-Lulu-wal-Marjaan)

26వ అధ్యాయం - హెరక్లియస్‌కు ఇస్లాం సందేశం అందజేస్తూ దైవప్రవక్త (సల్లం) లేఖ

1162. హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం:- నేను అబూ సుఫ్యాన్ (రజి) నోట ఈ సంభాషణ విన్నాను. ఆయన ఇలా తెలియజేశారు: 'నాకు, దైవప్రవక్త (సల్లం)కు మధ్య (హుదైబియా) ఒప్పందం జరిగి ఉన్న రోజుల్లో నేను (వ్యాపార నిమిత్తము విదేశాలకు) ప్రయాణమయ్యాను. నేను సిరియాలో విడిది చేసినప్పుడు (రోమ్ చక్రవర్తి) హెరక్లియస్ పేర దైవప్రవక్త (సల్లం) లేఖ ఒకటి చేరింది. దాన్ని హజ్రత్ వహ్యా కల్బీ (రజి) తీసుకొచ్చారు. ఆయన దాన్ని బుస్రా పాలకునికి అందజేశారు, బుస్రా పాలకుడు దాన్ని హెరక్లియస్ దగ్గరకు పంపాడు. ఈ లేఖ హెరక్లియస్‌కు అందిన తరువాత అతను సభాసదులతో "తనను తాను దైవప్రవక్తనని ప్రకటించుకున్న వ్యక్తి జాతికి చెందినవారు ఎవరైనా ఈ ప్రాంతంలో ఉన్నారా?" అని ప్రశ్నించాడు. దానికి వారు ఉన్నారని సమాధానమిచ్చారు.

హజ్రత్ అబూ సుఫ్యాన్ (రజి) ఇలా అన్నారు: ఆ తరువాత నన్ను పిలిపించారు. నా వెంట ఖురైష్ తెగకు చెందిన మరి కొందరు వ్యక్తులు కూడా ఉన్నారు. మేమంతా హెరక్లియస్ దగ్గరకు వెళ్ళాము. అతను మమ్మల్ని తన ముందు కూర్చోబెట్టి "మీలో దైవప్రవక్తనని ప్రకటించుకున్న వ్యక్తికి బంధుత్వం రీత్యా ఎక్కువ సన్నిహితులెవరు?" అని అడిగాడు. "అందరికంటే నేనెక్కువ సన్నిహితుడ్ని" అన్నాను నేను. అప్పుడతను దుబాసీని పిలిపించి "దైవప్రవక్తనని ప్రకటించుకున్న వ్యక్తిని గురించి నేనితడ్ని కొన్ని ప్రశ్నలు అడుగుతాను. ఒకవేళ ఇతను నాతో అబద్ధమాడితే నీవు దాన్ని ఖండించాలి. ఈ విషయం వీరందరికీ తెలియజెయ్యి" అని అన్నాడు.

హజ్రత్ అబూ సుఫ్యాన్ (రజి) ఇలా చెబుతున్నారు: 'దైవసాక్షి! నా అనుచరులు నా మాటలను నిరాకరిస్తారన్న భయం లేకపోతే నేను తప్పకుండా అబద్ధమాడేవాడ్ని'. తరువాత హెరక్లియస్ తన దుబాసీతో "ఆ వ్యక్తి (దైవప్రవక్త) వంశం, గోత్రం ఎలాంటివో ఇతడ్ని అడుగు" అని అన్నాడు. నేను సమాధానమిస్తూ "మా అందరిలో కెల్లా ఆయన వంశం, గోత్రం ఎంతో ఉన్నతమైనవి" అని చెప్పాను. "సరే ఆయన తాతముత్తాతలలో ఎవరైనా చక్రవర్తి అయ్యారా?" అని అడిగాడతను. నేను లేదన్నాను. "దైవదౌత్య ప్రకటనకు పూర్వం ఆయన ఎప్పుడైనా అబద్ధమాడినట్లు నీవు విన్నావా?" అని అడిగాడు హెరక్లియస్ తిరిగి. నేను లేదన్నాను. "ఆయన్ని (ఎక్కువగా) ధనికులు అనుసరిస్తున్నారా? లేక పేదలు అనుసరిస్తున్నారా?" అడిగాడతను మళ్ళీ. నేను "ధనికులు కాదు, పేదలే" అన్నాను. "ఆయన్ని విశ్వసిస్తున్న వారి సంఖ్య పెరుగుతోందా లేక తగ్గిపోతోందా?" అడిగాడతను. "తగ్గిపోవడం లేదు, ఇంకా పెరిగిపోతోంది" అన్నాను నేను.

"అతని అనుచరుల్లో ఎవరైనా అతని ధర్మం స్వీకరించిన తరువాత, అది మంచిది కాదని భావించి దాన్ని వదలి పెట్టడం జరిగిందా?" అడిగాడు హెరక్లియస్. నేను "అలాంటిదేమీ జరగ లేద"న్నాను. "మీరు ఆయనతో ఎప్పుడైనా యుద్ధం చేశారా?" ప్రశ్నించాడతను. నేను చేశామన్నాను. "అయితే ఫలితాలు ఎలా ఉండేవి?" అడిగాడతను. "మాకు, వారికి మధ్య యుద్ధం బొక్కెన మాదిరిగా ఉంటుంది. ఒకప్పుడు వాళ్ళు గెలిస్తే, మరొకప్పుడు మేము విజయం సాధిస్తుంటాము" అన్నాను నేను. "సరే ఆయన ఎప్పుడైనా వాగ్దాన (ఒప్పంద) భంగం చేస్తారా?" అడిగాడతను. "లేదు, అయితే ప్రస్తుతం ఆయనకు - మాకు మధ్య ఒక నిర్ణీత గడువుకు గాను ఒడంబడిక జరిగింది. కాని ఈసారి ఆయన ఏం చేస్తాడో మాకు తెలియదు" అన్నాను నేను.

అబూ సుఫ్యాన్ (రజి) కథనం:- మొత్తం సంభాషణలో ఈ ఒక్కమాట తప్ప నా తరపున మరే విషయం కలపడానికి అవకాశం లభించలేదు. అతను నన్ను, "ఇలాంటి (దైవదౌత్య) ప్రకటన ఇంతకు పూర్వం (అరబ్బుల్లో) ఎవరైనా చేశారా?" అని అడిగాడు. నేను లేదన్నాను. ఆ తరువాత హెరక్లియస్ తన దుబాసీతో నాకు చెప్పమని ఇలా అన్నాడు.

"నేను నిన్ను ఆయన వంశం గురించి అడిగాను. నీవు మీ అందరి కంటే ఆయనది గొప్ప వంశమని చెప్పావు. నిజం, దైవప్రవక్తలు ఎప్పుడూ ఉన్నత వంశాలలోనే జన్మిస్తారు. నేను నిన్ను, ఆయన తాత ముత్తాతలలో ఎవరైనా చక్రవర్తి అయ్యారా అని అడిగాను. నీవు లేదన్నావు. ఆయన తాతముత్తాతలలో నిజంగా ఎవరైనా చక్రవర్తి అయి ఉంటే ఈయన తన తాతముత్తాతల రాజ్యాధికారం కోరుతున్నాడని నేను దీన్ని బట్టి భావిస్తాను. (కాని అలాంటిదేమీ లేదు) తరువాత నేను, ఆయన అనుయాయుల్లో ధనికులున్నారా, పేదలున్నారా అని అడిగాను. నీవు పేదలే ఉన్నారని అన్నావు. నిజం, దైవప్రవక్తలకు (సాధారణంగా) పేదలే అనుయాయులవుతారు".

దైవదౌత్య ప్రకటనకు పూర్వం ఆయన ఎప్పుడైనా అబద్ధమాడినట్లు చూశావా అని నేను నిన్ను అడిగాను. నీవు లేదన్నావు. దీన్ని బట్టి ప్రజలతో ప్రజల వ్యవహారాలను గురించి ఎన్నడూ అబద్ధమాడని వ్యక్తి దేవుని విషయంలో అబద్ధమాడలేడని నేను భావిస్తున్నాను. ఆయన అనుచరుల్లో ఎవరైనా ఆయన ధర్మం స్వీకరించిన తరువాత అది నచ్చక దాన్ని వదలెయ్యడం జరిగిందా అని అడిగాను. నీవు లేదన్నావు. అదే నిజమైన విశ్వాసమంటే. మనిషి ఒక విషయాన్ని హృదయపూర్వకంగా విశ్వసించినపుడు ఇక దాన్ని మానెయ్యలేడు. నేను నిన్ను ఆయన అనుచరుల సంఖ్య పెరుగుతోందా తగ్గిపోతోందా అని అడిగాను. నీవు పెరుగుతోందని చెప్పావు. నిజమైన విశ్వాస పరిస్థితి ఇలాగే ఉంటుంది. అది దిన దిన ప్రవర్ధమానమవుతూనే ఉంటుంది. చివరికి అది పరిపక్వదశకు చేరుకుంటుంది. నేను నిన్ను మీరెప్పుడైనా ఆయనతో యుద్ధం చేశారా అని అడిగాను. నీవు చేశామని, ఒక్కోసారి మేము, ఒక్కోసారి ఆయన యుద్ధంలో విజయం సాధించడం జరుగుతుంటుందని అన్నావు. దైవప్రవక్తలందరి పరిస్థితి కూడా ఇలాగే ఉంటుంది. ప్రారంభంలో వారు (దేవుని చేత) పరీక్షించబడతారు. చివరికి అంతిమ విజయం వారికే లభిస్తుంది.

"నేను నిన్ను ఆయన ఎప్పుడైనా ఒప్పందం ఉల్లంఘించడం గాని, వాగ్దానభంగం చేయడం గాని జరిగిందా అని అడిగాను. నీవు లేదన్నావు. దైవప్రవక్తలు ఎన్నటికీ ఒప్పందాలు ఉల్లంఘించి మోసానికి పాల్పడరు. నేను నిన్ను ఇలాంటి ప్రకటన ఆయనకు పూర్వం (అరబ్బుల్లో) ఎవరైనా చేశారా అని అడిగాను. నీవు లేదన్నావు. ఆయనకు పూర్వం ఎవరైనా ఇలాంటి ప్రకటన చేసి ఉంటే ఈయన కూడా అలాంటి మాటలే పలుకుతున్నాడని మనం భావించవచ్చు. కాని అలాంటిదేమీ లేదు".

హజ్రత్ అబూ సుఫ్యాన్ (రజి) ఇలా అంటున్నారు - ఆ తరువాత హెరక్లియస్ "ఆయన మిమ్మల్ని ఏ విషయాలను గురించి ఆదేశిస్తున్నాడు"? అని అడిగాడు. "ఆయన మమ్మల్ని నమాజ్, జకాత్ (పేదల ఆర్థికహక్కు), బంధువుల పట్ల ప్రేమాభిమానాలు, పవిత్రత పరిశుద్ధతలను గురించి ఆదేశిస్తున్నారు" అని అన్నాను నేను.

"నీవు చెప్పిన విషయాలన్నీ నిజమయితే ఆయన తప్పకుండా దైవప్రవక్తే. అందులో ఇక ఎలాంటి సందేహం లేదు. ఒక దైవప్రవక్త ప్రభవించనున్నారని నాకు ముందే తెలుసు. కాని ఆ ప్రవక్త మీ (జాతి)లో ప్రభవిస్తారని నేను అనుకోలేదు. నేనాయన దగ్గరకు చేరుకోగలిగితే తప్పకుండా ఆయన్ని కలుసుకోవడానికి ఇష్టపడతాను. ఒకవేళ నేను ఆయన దగ్గర ఉంటే తప్పకుండా ఆయన కాళ్ళు కడుగుతాను. ఆయన రాజ్యం ఈనాడు నా అధీనంలో ఉన్న భూభాగం దాకా తప్పకుండా విస్తరిస్తుంది" అన్నాడు హెరక్లియస్.

హజ్రత్ అబూసుఫ్యాన్ (రజి) కథనం:- హెరక్లియస్ ఈ సంభాషణ తర్వాత దైవప్రవక్త (సల్లం) దివ్యలేఖను తెప్పించి దాన్ని చదివాడు. అందులో ఇలా ఉంది - "కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం. దైవప్రవక్త ముహమ్మద్ తరపున రోమ్ చక్రవర్తి హెరక్లియస్ పేర వ్రాయునది. సన్మార్గం అవలంబించే వానికి సలాం. నేను ఏకేశ్వర వచనం ద్వారా నిన్ను ఇస్లాం స్వీకరణ వైపుకు ఆహ్వానిస్తున్నాను. ఇస్లాం స్వీకరించు. ఈ ధర్మమే నీ శాంతీ రక్షణలకు హామీనిస్తుంది. నీవు ముస్లింగా మారితే దేవుడు నీకు రెట్టింపు పుణ్యఫలం ప్రసాదిస్తాడు. ఒకవేళ నీవు దీనికి అంగీకరించకపోతే గుర్తుంచుకో, నీ ప్రజల★ పాపభారం కూడా నీ మీదే వచ్చి పడుతుంది - (ఖుర్ఆన్ సూక్తి): ఓ గ్రంథవహులారా! మీకు మాకు మధ్య ఉన్న ఉమ్మడి విషయం వైపుకు రండి. అదేమిటంటే మనం అల్లాహ్‌ను తప్ప మరెవర్నీ ఆరాధించకూడదు. ఆయనకు ఎవర్నీ సాటి కల్పించకూడదు. మనలో ఏ ఒక్కరూ ఆ దేవుడ్ని వదలి మరెవర్నీ మన ప్రభువుగా చేసుకోకూడదు. (ప్రవక్తా!) ఈ విషయాన్ని వారు అంగీకరించకపోతే, 'మేము (ఒక్క దేవుడ్ని మాత్రమే ఆరాధించే) ముస్లింలము. దీనికి మీరే సాక్షులు' అని వారికి స్పష్టంగా చెప్పెయ్యి. (3:64)

★ ఇక్కడ మూలభాషలో 'అరీసీన్' అనే పదం ప్రయోగించబడింది. అంటే రైతులని ఒక అర్థం. మొత్తం ప్రజానీకం కోసం కూడా ఈ పదాన్ని వాడతారు. లేదా ప్రముఖ క్రైస్తవ పండితుడైన అబ్దుల్లా బిన్ అరీస్ అనుచరులని కూడా అర్థముంది. ఈ పండితుడు మసీహ్ ధర్మంలో కొత్త కొత్త విషయాలను సృష్టించి దాన్ని పూర్తిగా మార్చివేశాడు. ఈ విధంగా అతను హజ్రత్ ఈసా (అలైహి) గారి ధర్మానికి విముఖుడైపోయాడు. ఇక్కడ నీ ప్రజల పాప భారం కూడా నీమీదే వచ్చి పడుతుంది అంటే, నేనిప్పుడు నిన్ను అసలైన మసీహ్ ధర్మం (ఇస్లాం)వైపుకు పిలుస్తున్నాను, నీవీ పిలుపును స్వీకరించకపోతే, నిన్ను అనుసరిస్తూ మార్గ భ్రష్టత్వంలోనే పడిఉన్న నీ ప్రజల పాప భారం కూడా నీ మీద పడుతుందని అర్థం. (సంకలనకర్త).

హెరక్లియస్ ప్రవక్త లేఖ చదవడం పూర్తి చేయగానే ప్రజల కేకలు, అరుపులు మిన్నుముట్టాయి. పెద్ద కలకలం బయలుదేరింది. రకరకాల మాటలు వినరాసాగాయి. అప్పుడు హెరక్లియస్ తన భటుల్ని ఆజ్ఞాపించి మమ్మల్ని బయటికి పంపివేశాడు.

హజ్రత్ అబూసుఫ్యాన్ (రజి) కథనం:- మేము అక్కడ్నుంచి బయలుదేరుతున్నప్పుడు నేను నా అనుచరులతో "అబూ కబ్షా కొడుకు* (అంటే దైవప్రవక్త) హోదా అంతస్థులు బాగా పెరిగిపోయాయి. ఇప్పుడు ఆయనకు రోమన్ల చక్రవర్తి కూడా భయపడుతున్నాడు" అని అన్నాను. ఈ సంఘటన తరువాత దైవప్రవక్త (సల్లం) త్వరలోనే (యావత్తు ప్రపంచంలో) ఆధిక్యత పొందగలరని నాకు నమ్మకం ఏర్పడింది. చివరికి దేవుడు నాక్కూడా ఇస్లాం స్వీకార సద్బుద్ధిని ప్రసాదించాడు.

(సహీహ్ బుఖారీ:- 65వ ప్రకరణం - తఫ్సీర్, ఆలిఇమ్రాన్ సూర, 4వ అధ్యాయం - ఖుల్ యా అహ్లల్ కితాబి తఆలౌ......)

Visit http://Teluguislam.net for Authentic Telugu Islamic Resources